సాగర తీరంలో ట్రాఫిక్ కష్టాలు



బీచ్ రోడ్డులోని బైక్ పార్కింగ్ జోన్‌లో నిలిపిన కార్లు



సాయంత్రం వేళల్లో నిలిచిపోతున్న ట్రాఫిక్



బీచ్ రోడ్డులో వందల సంఖ్యలో ప్రయాణిస్తున్న వాహనాలు (ఫైల్)

- బీచ్ రోడ్డులో వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు శూన్యం
- రహదారులు, ఫుట్‌పాత్‌లపైనే పార్కింగ్
- సాయంత్రం వేళల్లో విపరీతంగా రద్దీ
- ఖాళీ స్థలాల్లో వాణిజ్య సముదాయాల నిర్మాణానికి ఆసక్తి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్శకులు, వాహన చోదకులు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు దర్శనమిస్తున్నాయి. ఉదయం వేళలో ప్రశాంతంగా కనిపించే రహదారులు.. సాయంత్రం వేళల్లో విపరీతమైన రద్దీని ఎదుర్కొంటున్నాయి. బీచ్ రోడ్డులో వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకమైన స్థలాలు లేకపోవడం దీనికి కారణంగా నిలుస్తోంది. దీంతో సాగర తీరాన సరదాగా గడుపుదామని వస్తున్న సందర్శకులకు, పార్కింగ్ సదుపాయం లేక వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

రోడ్డుపైనే నిలిపివేత

బీచ్ రోడ్డులో ఆర్.కె.బీచ్ నుంచి పామ్ బీచ్ హోటల్ వరకు మార్గానికి ఇరువైపులా వాహనాల పార్కింగ్ ఉంది. ఈ రహదారిలో సాయంత్రం వేళల్లో వేలాది మంది పర్యాటకులు, నగరవాసులు వస్తుంటారు. దీనితో ఈ మార్గం వాహనాలతో నిండిపోతోంది. సముద్రానికి ఆనుకుని ఉన్న వైపు ద్విచక్ర వాహనాలకు, దానికి మరో వైపునున్న రహదారిపై కార్లు నిలిపేలా పోలీసులు ప్రత్యేకంగా విధానాన్ని అమలు చేస్తున్నారు. అయితే ఇక్కడ సాయంత్రం వేళల్లో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ద్విచక్ర వాహనాలు నిలిపే ప్రాంతంలో యథేచ్ఛగా కార్లు నిలుపుతున్నారు. దీంతో రోడ్డుపై ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. నో పార్కింగ్ ఏరియా అని పోలీసులు బోర్డులు పెట్టినా.. వీటిని పట్టించుకునేవారు కరువవుతున్నారు.

దుకాణాలతో నిండిన ఫుట్‌పాత్‌లు

బీచ్‌ను ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లు నడవడానికి కూడా ఖాళీ లేని పరిస్థితి నిత్యం ఎదురవుతోంది. ఫుట్‌పాత్‌లపై ప్రతీ వంద మీటర్లకు ఒక తోపుడు బండి ఉంటుంది. వీటిలో మురీ మిక్చర్, బజ్జీ వంటివి విక్రయిస్తారు. తీరం పొడవునా దాదాపు 60 వరకు ఇటువంటి బళ్లు ఉన్నాయి. వీటి మధ్యలో ఐస్ క్రీం బళ్లు 30, నూడిల్స్ బళ్లు, 30 వరకు మొక్కజొన్న కంకెలు అమ్మే దుకాణాలు మరికొన్ని ఉంటాయి. దీనితో తీరంలో ఒకవైపు రహదారంతా ఈ బళ్లతో నిండిపోతోంది. ఈ మార్గంలో శని, ఆదివారాల్లో నడవడం కూడా కష్టతరంగా మారింది.

ఖాళీ స్థలాల్లో కొత్త నిర్మాణాలు

బీచ్ రోడ్డులో ఖాళీ జాగా కనిపిస్తే దుకాణం పెట్టేయడం, నిర్మాణాలు చేసేయడం పరిపాటిగా మారిపోతోంది. కాళీమాత ఆలయం నుంచి విక్టరీ ఎట్ సీకి వచ్చే మార్గంలో మత్స్యదర్శిని, జీవీఎంసీ ఎకో బజార్, చాట్ బళ్లు, అమూల్ ఐస్ క్రీం, అరకు కాఫీ, సిల్వర్ స్పూన్ రెస్టారెంట్‌లు, జూష్ షాప్‌లు, ఐస్ క్రీం, మోమోస్ దుకాణాలు, పోలీస్ మెస్ వద్ద దుకాణాలు, వించీస్ రెస్టారెంట్, వైఎంసీఏ ఎదురుగా పదుల సంఖ్యలో దుకాణాలు రహదారికి రెండో వైపున ఉన్నాయి. వీటితో పాటు సీ హారియర్, టీయూ–142 యుద్ధ విమానం, యూహెచ్3హెచ్ హెలీకాప్టర్ మ్యూజియం వంటివి నిర్మించారు. గతంలో ఈ ప్రాంతంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వాహనాల పార్కింగ్ చేపట్టాలని జీవీఎంసీ భావించింది. దీనిలో భాగంగా ఏయూ నుంచి భూమిని సైతం సేకరించింది. తరువాతి కాలంలో దీనిని పక్కన పెట్టి ప్రస్తుతం ఉన్న సీ హారియర్ మ్యూజియం భవనం అక్కడ నిర్మించేశారు. దీంతో సాయంత్రం వేళల్లో వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలం లేకుండా పోయింది.



వించీస్ రెస్టారెంట్ వద్ద నిర్మిస్తున్న కొత్త దుకాణాలు



బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై సందర్శకుల రద్దీ

ఆదాయార్జనే లక్ష్యంగా..

అధికారులు తాజాగా వించీస్ పక్కనే ఉన్న కొంత స్థలంలో నూతనంగా దుకాణాలు కట్టేస్తున్నారు. కనీస ఆలోచన లేకుండా, భవిష్యత్ అవసరాలను గుర్తించకుండా ఆదాయార్జనే లక్ష్యంగా దుకాణాలు నిర్మించడం విమర్శలకు తావిస్తోంది. పర్యాటకులకు ఉపయుక్తంగా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన అధికారులు కేవలం నిర్మాణాలకే ప్రాధాన్యమివ్వడం కొంత ఇబ్బందికరంగా మారుతోంది. బీచ్ రోడ్డులో ఒకవైపు సముద్రం ఉండటంతో విస్తరణకు అవకాశం లేదు. రెండో వైపు ఉన్న ప్రాంతంలో యథేచ్ఛగా నిర్మాణాలు చేసేస్తుంటే సాగర తీర సౌందర్యం దెబ్బతింటోంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి బీచ్ రోడ్డులో మల్టీ లెవెల్ పార్కింగ్ వంటిదేదైనా నిర్మించే దిశగా చర్యలు చేపట్టాలని పలువురు సందర్శకులు, నగరవాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్త వెంకోజిపాలెం గ్రామ సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ఎంవీపీకాలనీ: కొత్త వెంకోజిపాలెం గ్రామ సేవా సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నికైంది. గ్రామ పెద్దల సమక్షంలో సోమవారం ఈ ఎన్నిక నిర్వహించారు. కార్యవర్గ నూతన అధ్యక్షుడిగా ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పీలా ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడిగా సూరిశెట్టి సిమ్మినాయుడు, కార్యదర్శిగా మళ్ల రవి, సహాయ కార్యదర్శిగా కోరుబిల్లి ఈశ్వరరావు, కోశాధికారిగా శరకం అప్పలరాజు, ఆడిటర్‌గా కాళ్ల ఆనంద్‌ని సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన సభ్యులను గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు.

మేనేజ్‌మెంట్ విద్యపై 28న సదస్సు

ఎంవీపీకాలనీ: మేనేజ్‌మెంట్ విద్యలో ఉన్నత ఉపాధి అవకాశాలపై ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం బీ స్కూల్ ఆధ్వర్యంలో ఈ నెల 28న సదస్సు నిర్వహించనున్నామని బీ స్కూల్ డైరెక్టర్ జనరల్ ఆచార్య వి.కృష్ణమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మేనేజ్‌మెంట్ విద్యలో కెరీర్ అవకాశాలు : స్కిల్ ట్రెండ్స్, మార్గాలు' అనే అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. మేనేజ్‌మెంట్ విద్యలో తాజా ట్రెండ్స్‌పై నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. దీనిలో విజయవంతమైన కెరీర్ నిర్మించుకోవడంపై విద్యార్థులకు నిపుణుల మార్గదర్శకత్వం ఉంటుందన్నారు. విద్యార్థుల సందేహాలకు సమాధానాలిస్తారన్నారు. ఆసక్తి గల నగరంలోని మేనేజ్‌మెంట్ కళాశాలల విద్యార్థులు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల వృత్తిపరమైన అభివృద్ధికి ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుందని ఆచార్య కృష్ణమోహన్ పేర్కొన్నారు. నగర విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నాయకుల నివాళి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లో సోమవారం జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 73వ బలిదాన దినోత్సవం నిర్వహించారు. బీజేపీ నగర మెడికల్ సెల్ కన్వీనర్ కె.వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగర, వార్డు నాయకులు పాల్గొని శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ దేశంలో 'ఒకే దేశం.. ఒకే ప్రధాని' అనే నినాదాన్ని తీసుకొచ్చారన్నారు. జమ్మూకశ్మీర్‌లో 370 ఆర్టికల్ నినాదం తొలగించాలని పోరాడారని, జాతీయ హిందూ నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేసి బలిదానమైన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రమణ, అప్పారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్లు

ఆరిలోవ: హెల్త్‌సిటీ మెడికవర్ ఆస్పత్రిలో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్లు విజయవంతంగా జరుగుతున్నాయని ఆస్పత్రి మెడికల్ అంకాలజీ చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ రామవత్ తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో అత్యాధునిక బీఎంటీ యూనిట్ అందుబాటులో ఉందన్నారు. ఏడాది కాలంలో 30 ట్రాన్స్‌ప్లాంటేషన్లు నిర్వహించామని చెప్పారు. బీఎంటీల ద్వారా కేవలం క్యాన్సర్లకే కాకుండా ఆప్లాస్టిక్ అనీమియా, తలసేమియా, సికిల్ సెల్ అనీమియా తదితర వ్యాధుల నివారణకు కూడా నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో మెడికవర్ అంకాలజీ విభాగం వైద్యులు డాక్టర్ సాహిత్య, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 23వ వార్డులో సోమవారం జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు నిర్వహించారు. సీతమ్మధార రైతుబజార్, చైతన్య నగర్, జాతీయ రహదారి ప్రాంతాల్లో తనిఖీలు చేసి, వ్యాపారులకు అవగాహన కల్పించారు. పలువురికి జరిమానాలు విధించి, ప్లాస్టిక్ కవర్లు, నిషేధిత వస్తువులను సీజ్ చేశారు.

తోటగరువు హైస్కూల్ విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీ సీట్లు



పి.వసంత



కె.ఇందిర

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ సీట్లు పొందారు. ఇక్కడ 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన ఇద్దరు బాలికలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీట్లు సాధించారు. టెన్త్ స్కూల్ టాపర్ పూజర్ల వసంత(576/600), ద్వితీయ స్థానంలో నిలిచిన కాలపురెడ్డి ఇందిర(573/600) సోమవారం ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో శ్రీకాకుళం కళాశాలలో సీట్లు పొందినట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని దుర్గాభవాని తెలిపారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ పాఠశాల నుంచి 2023–24 విద్యా సంవత్సరంలో కె.రత్నసావియా, టి.రామ్ చరణ్ ఉత్తమ మార్కులు సాధించారు. వారిద్దరు నూజివీడు ఐఐఐటీలో సీటు పొందిన విషయం తెలిసిందే.

శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థి ఎంపిక



పి.ఆకాష్

జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థి ట్రిపుల్ ఐటీ సీటు సాధించాడు. టెన్త్‌లో పొన్నకాయల ఆకాష్ 590/600 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. సోమవారం వెలువడిన ఫలితాల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో ఆకాష్ సీటు సాధించినట్లు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన ఆకాష్ ఐదో తరగతి నుంచి గురుకులంలో చదివినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆకాష్‌ను ప్రిన్సిపాల్‌తోపాటు గురుకులం ఉపాధ్యాయులు అభినందించారు.

'శ్రీవారి శంఖుచక్ర నామాలు'కు తొలగని ముసుగు



ఎంవీపీ టీటీడీ కూడలిలో ముసుగు వేసి వదిలేసిన శ్రీవారి శంఖుచక్ర నామాలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ టీటీడీ కూడలిలో ఏర్పాటు చేసిన శ్రీవారి శంఖుచక్ర నామాల ముసుగు తొలగలేదు. కూడలి ఆధునికీకరణలో భాగంగా జీవీఎంసీ స్మార్ట్ వర్క్స్ విభాగం శంకుచక్రనామాలను ఏర్పాటు చేసింది. రెండు నెలలు గడుస్తున్నా.. నేటికీ వీటికి వేసిన ముసుగు తొలగించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. టీటీడీ కూడలి ఆధునికీకరణకు మరో 20 శాతం పనులు చేపట్టాల్సి ఉండగా.. బడ్జెట్ కేటాయింపు సమస్యలతో పనులు నిలిచిపోయాయి. ఈ కారణంగానే శంకుచక్రనామాలు పూర్తిస్థాయిలు ప్రదర్శించలేనట్లు సమాచారం. వర్షా కాలం నేపథ్యంలో ముసుగు తీయకుండానే శంఖుచక్ర నామాలు రంగులు కోల్పోతాయేమోననే భక్తులు భావిస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి శ్రీవారి శంఖుచక్ర నామాలు కనువిందు చేసేలా అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

గురుకులం ఆవరణ అస్తవ్యస్తం



శ్రీకృష్ణాపురం గురుకులం ఆవరణలో దట్టంగా పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం ఆవరణ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీని పరిసరాలను శుభ్రం చేయకపోవడంతో ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు, చెత్తతో నిండిపోయి అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడ ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు చదువుతున్నారు. వారికి వసతి సౌకర్యం ఉండటంతో నిత్యం ఇక్కడే ఉంటారు. దీని ఆవరణలో భోజనాల హాల్ ఆవరణ, పిల్లలు ఆడుకునే ప్రాంగణం, తరగతులు నిర్వహించే గదుల వెనుక భాగం, క్వార్టర్స్ పరిసరాలు పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తతో నిండిపోయాయి. ఇక్కడ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడ్డి, పిచ్చి మొక్కలు దట్టంగా ఉండటంతో దోమలు పెరిగిపోతున్నాయని, పాములు కూడా చేరే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గురుకులం క్వార్టర్స్ ఆవరణలోని తరగతి గదుల వెనుక, క్రీడా ప్రాంగణం చుట్టూ ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వివిధ రకాల పండ్ల జాతులు, అందం కోసం పలు రకాల మొక్కలు నాటారు. వాటికి సంరక్షణ లేకపోవడంతో అప్పట్లో నాటిన వాటిలో 10 శాతం మొక్కలు కంటే మిగలలేదు. వాటి చుట్టూ సంరక్షణ లేక ఏపుగా గడ్డి, పిచ్చి మొక్కలు మొలిచాయి. దీని ఆవరణమంతా తరచూ శుభ్రం చేయిస్తుండాలని విద్యార్థుల తల్లిదండ్రులు గురుకులం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను కోరుతున్నారు.



ఆవరణలో పేరుకుపోయిన చెత్త

'పోరు'కు పోటెత్తిన యువతరంగం



యువత పోరు ర్యాలీలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కనకరావు, బోని శివరామకృష్ణ తదితరులు



తూర్పు నుంచి ర్యాలీగా వెళ్తున్న సమన్వయకర్త మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, యువత

మద్దిలపాలెం: యువతకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం దగా చేయడంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గం నుంచి యువత పోటెత్తింది. పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో 15 వార్డుల్లోని పార్టీ శ్రేణులతోపాటు నిరుద్యోగ యువత, యువకులు అధిక సంఖ్యలో కలెక్టరేట్ వద్దకు తరలివెళ్లారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించకపోవడం, భృతి ఇవ్వకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షుడు నడింపల్లి కృష్ణంరాజు, గొలగాని శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముVvల సురేష్, కార్పొరేటర్లు మొల్లి లక్ష్మి, మువ్వల లక్ష్మి, అల్లంపల్లి రాజబాబు, బోని శివరామకృష్ణ, పీతల గోవింద్, దేవరకొండ మార్కండేయులు, పులగం కొండారెడ్డి, బోండా ఉమామహేశ్వరరావు, వాసుపల్లి యల్లాజీ, పీలా ప్రేమ్, చొల్లంగి నాగేశ్వరరావు, పతివాడ కనకరాజు, బోండా శ్రీను, పులగం సూర్యనారాయణరెడ్డి, బోస రమణరెడ్డి, సత్యాల వెంకట్, ప్రసంగి వాసు, నీలారెడ్డి, ఉమ్మిడి కల్యాణ్, కందిమల్ల రాజశేఖర్, శిరీష, జోషిలా, సకీనా, సత్యవతి, సాగరిక, పోలరత్నం, సంధ్య, శశికళ, వరలక్ష్మి, సత్యవాణి, బేగం, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై యువత కన్నెర్ర

బీచ్‌రోడ్డు: ఏడాదిగా రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు, ఉపాధి, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరుకు నగర యువత భారీగా తరలి వెళ్లారు. వర్షం పడుతున్నా లెక్కచేయకుండా బైక్ ర్యాలీలు, పాదయాత్రగా జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనపై నిరసన తెలిపారు.

ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో..

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో దళిత యువత పెద్ద ఎత్తున యువత పోరు ర్యాలీలో పాల్గొన్నారు. సిరిపురం నుంచి జిల్లా పరిషత్ వరకు సాగిన ఈ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు కనకరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బోని శివరామకృష్ణ పాల్గొన్నారు.



రామ్‌నగర్ నుంచి ర్యాలీగా వెళ్తున్న 28వ వార్డు యువత, నాయకులు

28వ వార్డు నుంచి..

జీవీఎంసీ 28వ వార్డు నుంచి యువత పోరు నిరసన కార్యక్రమానికి యువత తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో రామ్‌నగర్ నుంచి జిల్లా పరిషత్ వరకు ర్యాలీ చేశారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు.

మత్తుకు బానిస కావద్దు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాసిన్ డైరెక్టర్ రవికిరణ్

సీతంపేట: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా 'మత్తు వద్దు , బంగారు భవిష్యత్తే ముద్దు' అనే నినాదంతో బాలవికాస్ ఫౌండేషన్ రూపొందించిన గోడపత్రికను అక్కయ్యపాలెంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ ఈదర రవికిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరం మత్తుకు బానిస కావొద్దంటూ బాలవికాస్ ఫౌండేషన్ విస్తృత ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు నిత్యం గమనించాలని, వాళ్లకు అభిరుచి ఉన్న రంగంలో ప్రోత్సహిచాలని సూచించారు. బాలవికాస్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఈనెల 26న కళాశాలల్లో మాదకద్రవ్యాలపై యువతకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. జీఎస్టీ అండ్ కస్టమ్స్ అదనపు కమిషనర్ కాకరాల ప్రశాంత్, నాసిన్ సహాయ డైరెక్టర్ కె.ఆర్.ఎస్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారి కళాకారులు

సీతంపేట: ఇందు ఫైవ్‌స్టార్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ 27వ వార్షికోత్సవం సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. నృత్యభారతి డ్యాన్స్ టీచర్ మౌనిక, నాట్య రవళి డ్యాన్స్ మాస్టర్ పాలకొండ మధు ఆధ్వర్యంలో చిన్నారులు శాస్త్రీయ, జానపద, పాశ్చాత్య నృత్యాలు ప్రదర్శించి మెప్పించారు. కార్యక్రమంలో నగరానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు బి.ఎస్.రెడ్డి, మిమిక్రీ ఆర్టిస్టులు శ్రీనివాస్, జూనియర్ రాజబాబు తమ ప్రదర్శనలతో అలరించారు.